# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. పొందూరు ఖాదీకి అధికారికంగా జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ లభించడంపై కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

2. సమాజంలో లింగ వివక్ష తగ్గించడం 'నయీ చేతన 4.0' కార్యక్రమ లక్ష్యమని కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

3. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు కూటమి ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంతో పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు.

4. కొత్తగా ఎంపికైన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలను ఈనెల 16వ తేదీన అందజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.

5. తెలంగాణలో రెండవ దశ పంచాయతీ ఎన్నికలు ఈ రోజు జరగనున్నాయి.

==========================

పొందూరు ఖాదీకి అధికారికంగా జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ లభించడంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. జి.ఐ. ట్యాగ్‌తో పొందూరు ఖాదీకి ప్రత్యేక గుర్తింపు లభించిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇది పొందూరు చేనేత కార్మికులకు కొత్త అవకాశాలను కల్పిస్తుందన్నారు. తరతరాలుగా కష్టించి, నిబద్ధతతో ఈ కళను కాపాడుతూ వచ్చిన చేనేత కార్మికులకు ఈ గౌరవం అంకితం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

-------------------------

సమాజంలో లింగ వివక్ష తగ్గించడం 'నయీ చేతన 4.0' కార్యక్రమ లక్ష్యమని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తుళ్ళూరులో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డి.ఆర్.డి.ఏ సౌజన్యంతో లింగ సమానత్వ జాతీయ ప్రచార కార్యక్రమం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ లతో కలిసి జెండర్ రిసోర్స్ సెంటర్‌ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో బాల్య వివాహాలు, గృహ హింస, లింగ వివక్ష వంటి రుగ్మతలు నెలకొన్నాయని తెలిపారు. దేశ

వ్యాప్తంగా 4 లక్షల 50 వేల గృహ హింస కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు.

---------------------------

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంతో పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. ఎమ్మెల్యేలు ఆ దిశగా పని చేయాలని సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరి క్యాంపు కార్యాలయంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పోలవరం గిరిజన ప్రాంతాలు, ముంపు మండలాలతో కూడిన నియోజక వర్గమని, అక్కడి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సత్వరమే స్పందిస్తుందని స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నిన్న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లలో మొత్తం 2 లక్షల 746 కేసులు పరిష్కరించినట్లు న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి బి.ఎస్.వి హిమబిందు తెలిపారు. ఈ కేసులలో పరిహారంగా 52 కోట్ల 56 లక్షల రూపాయలు చెల్లించేందుకు ఆదేశించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి దేశ రాజకీయాల్లో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ చరిత్రను సృష్టించిన మహానేత అని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతిని పురస్కరించుకుని, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అటల్ – మోడీ సుపరిపాలన బస్సు యాత్ర నిన్న నంద్యాల చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహాన్ని మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బిసి జనార్ధన్ రెడ్డిలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ..

.వాయిస్.. 27 సెకన్లు

---------------------------

ప్రపంచ తెలుగు చిత్రకారుల సమాఖ్య –ఒబౌూాూ ఆధ్వర్యంలో '4వ చిత్రకళా సంత' ఈరోజు ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో ప్రారంభం కానుందని సమాఖ్య ముఖ్య కార్యదర్శి బాలయోగి తెలిపారు. నగరంలోని టిటిడి కల్యాణ మండపం రోడ్డులో ఈ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరగనుందని పేర్కొన్నారు. 'ఇంటింటి ఒక పెయింటింగ్' అనే ఇతి వృత్తంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. సామాన్యులకు సైతం చిత్రాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో 200 మందికి పైగా కళాకారులు చిత్రించిన వేల పెయింటింగ్‌లు ప్రదర్శించనున్నామని తెలిపారు.

---------------------------

తెలంగాణలో రెండో దశ పంచాయతీ ఎన్నికలు ఈ రోజు జరగనున్నాయి. ఏకగ్రీవమైన పంచాయతీలు మినహా రెండో దశలో 3 వేల 911 పంచాయతీ సర్పంచి స్థానాలకు, 29 వేల 917 వార్డు సభ్యుల స్థానాలకు ఈరోజు పోలింగ్ జరగనుంది.

---------------------------

కొత్తగా ఎంపికైన పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలను ఈనెల 16వ తేదీన అందజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గుంటూరు జిల్లా, మంగళగిరి ఏపిఎస్పి 6వబెటాలియన్‌లో ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా సభా వేదిక నిర్మాణం, వేదికకు చేరుకునే మార్గాలు, పార్కింగ్ సౌకర్యాలు, వివిఐపి, విఐపిలకు ఏర్పాటు చేసే వసతులు, ఇతర జిల్లాల నుంచి హాజరయ్యే అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులకు కల్పించాల్సిన సౌకర్యాలపై పోలీస్ ఉన్నతాధికారులకు ఆమె తగిన సూచనలు చేశారు.

---------------------------

రైతులకు అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన 38 రకాల ఉద్యాన పంటల వంగడాలను శాస్త్రవేత్తలు రూపొందించినట్టు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె. ధనుంజయ్ రావు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్న గూడెంలో ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డాక్టర్ ధనుంజయరావు నిన్న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. విదేశాలకు ఉత్పత్తి చేసే స్థాయిలో పండ్లు, పువ్వులు సాగు చేసే విధంగా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

రబీ సీజన్‌లో రాష్ట్రంలో వచ్చే రెండు నెలల్లో యూరియా వినియోగం అత్యధికంగా ఉండే అవకాశం ఉందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆ సమయంలో రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని బఫర్ నిల్వలను అందుబాటులో ఉంచడానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఎరువులలో నెలకు 2 లక్షల టన్నుల యూరియాను అందించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

---------------------------

భారత్ పర్యటనలో భాగంగా.. దక్షిణ ఆఫ్రికా క్రికెట్ జట్టు భారత్ తో ఈరోజు టి-20 క్రికెట్ 3వ మ్యాచ్‌లో తలపడనుంది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని దర్మశాలలో ఈ రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ...

వాయిస్.. 25 సెకన్లు

మరో వైపు.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా నమోదవుతున్నాయి. తెలంగాణాలో రానున్న 5 రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================